సాక్షి విజయనగరం

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



'దబ్బ'కొట్టిన ధర

సీతంపేట మార్కెట్‌లోకి పుట్టదబ్బ వచ్చేసింది. ఏటా ఈ సీజన్‌లో లభించే పంట ధరలు రైతుకు గిట్టుబాటుకావడంలేదు. - 8లో



రాష్ట్రస్థాయి పోటీలకు బొద్దాం విద్యార్థులు - 8లో

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు రాజాం మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు.



గుండెను పరిరక్షించుకోవాలి

ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ ఆరోగ్యకర జీవనం సాగించాలని ఎస్పీ దీపిక సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

ఇద్దరు టీచర్లు, హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

విజయనగరం అర్బన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ ఇటీవల కస్పా మున్సిపల్ పాఠశాలను సందర్శించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో 7వ తరగతికి చెందిన 38 మంది విద్యార్థుల్లో 10 మంది కూడా మాథ్స్, సైన్స్ సబ్జెక్టుల వర్క్‌బుక్స్ సరిగా రాయకపోవడం, అభ్యసనా సామర్థ్యాలు లోపించడాన్ని గుర్తించారు. అలాగే, నెల్లిమర్ల ప్రాథమిక పాఠశాలలో ఏ ఒక్క తరగతిని సక్రమంగా నిర్వహించడంలేని విషయాన్ని గమనించారు. దీనికి బాధ్యులుగా కస్పా హైస్కూల్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను, నెల్లిమర్ల ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్ఎంను సస్పెండ్‌చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.

జీఎన్‌ఎం కోర్సులో ప్రవేశాలకు కౌన్సెలింగ్



ప్రవేశపత్రాన్ని విద్యార్థికి అందజేస్తున్న వైద్యాధికారులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వేతర కళాశాల్లో జీఎన్‌ఎం కోర్సులో ప్రవేశాలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు కౌన్సెలింగ్ చేసి విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ప్రవేశ పత్రాలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో గిరాకీ ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో రైతు శాస్త్రవేత్తలు, సలహాదారులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక దిగుబడినిచ్చే వంగడాలను సృష్టించి రైతన్నకు అండగా నిలవాలని సూచించారు. పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఆనందరావు, రవిచంద్ర, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, సారా రవాణాపై ఉక్కుపాదం

- కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



పార్వతీపురంటౌన్: గంజాయి, సారా రవాణాదారులపై ఉక్కుపాదం మోపాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ విధిగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కోర్టుల్లో విచారణకు వచ్చిన కేసులపై స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు సరైన సమాధానాలతో సిద్ధంగా ఉండాలన్నారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరవుతున్నారా లేదా, వారిని ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తున్నారా అన్న సమాచారాన్ని కోర్టు కానిస్టేబుల్ ద్వారా తెలుసుకొని సాక్షులకు భరోసా ఇవ్వాలన్నారు. రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదుచేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

గెలుపే లక్ష్యం



వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

- రానున్న 6 నెలలు ఎంతో కీలకం
- 45 రోజుల పాటు ప్రజలతో మమేకమయ్యేలా కార్యక్రమాలు
- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం
- వచ్చేనెల 11 నుంచి ఎందుకు జగన్ ఆంధ్రాకు కావాలి..?
- ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు విజయవంతంలో కీలక పాత్ర పోషించాలి
- ప్రతి గ్రామం, వార్డులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో దిశా నిర్దేశం చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స

విజయనగరం: రాష్ట్రంలో 2024లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా... వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. నాలుగన్నరేళ్ల ప్రభుత్వ పాలన ఒక భాగమైతే రానున్న 6 నెలలు ఎంతో కీలకమని, 2019 ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో నమోదైన ఫలితాలను మరోసారి సాధిద్దామన్నారు. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన ఫూల్‌బాగ్ ప్రాంతంలోని జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి అంజలి ఘటించారు. ముఖ్యమంత్రి 45 రోజుల పాటు ప్రజలతో మమేకమయ్యేలా రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజారోగ్యమే పరమావధిగా ఈ నెల 30 నుంచి ప్రభుత్వం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వైద్య శిబిరాలు ఆయా సచివాలయాల పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సలహా మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ అవనాపు విక్రమ్, విజయనగరం నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండలాధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, జెడ్పీటీసీ, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

11 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి..?'

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వచ్చే నెల 11 నుంచి ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి..? అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వై.వి.సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ వెల్లడించారు. సచివాలయాల పరిధిలో రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ మండలాధ్యక్షులు, ఇతర మండల స్థాయి ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు.

- మొదటిరోజు ఆ సచివాలయం పరిధిలో గడిచిన నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించాలన్నారు. అనంతరం అదే ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, అక్కడే రాత్రి చేసి పార్టీ బలోపేతంపై చర్చించాలన్నారు.
- రెండవరోజు సచివాలయం పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి 'ఆపు బాబు నాటకం-జగనే మా నమ్మకం' అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. అదే సందర్భంలో పార్టీ రూపొందించిన ప్రత్యేక కరపత్రాల ద్వారా 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు, 2019 ఎన్నికలకు ముందు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేసిన విధానాన్ని వివరించడంతో పాటు ప్రభుత్వ పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు.

కలిసికట్టుగా సాగుదాం



గడిచిన నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. మన ప్రభుత్వ పాలనలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఎంతో మేలు జరిగింది. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించాం. ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. ప్రభుత్వ మెడికల్ కళాశాలను సాకారం చేసుకున్నాం. సాగు నీటి ప్రాజెక్టుల మిగులు పనులు పూర్తిచేసుకుంటున్నాం. తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచుతాం. నియోజకవర్గాల్లో నేతలమధ్య సమన్వయం కొరవడింది. కొందరు ఎమ్మెల్యేలు చక్రవర్తుల్లా వ్యవహరిస్తుంటే... ఎంపీపీలు సామంతరాజుల్లా నడుచుకుంటున్నారు. ఎవరికైనా సమస్యవస్తే ఒకవైపే కాస్తున్నారు. అది సరి కాదు. అందరినీ సమదృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించుకోవాలి. వ్యక్తులు కాదు పార్టీ ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలి. మరల జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మన అందరికీ పదవులు వచ్చి గౌరవం దక్కుతుంది. రానున్న ఆరు నెలలు పార్టీ శ్రేణులంతా ఉత్సాహంగా పనిచేయాలి. సోషల్ మీడియా మరింత దూకుడు పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు టీడీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టాలి.

– బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి

రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాలన



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పారదర్శకమైన పాలన సాగిస్తోంది. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు సాగాయి. ఒక్క సాలూరు నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు రూ.1000 కోట్ల లబ్ధి చేకూరింది. వచ్చేనెల 11 నుంచి పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి..? కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి. కార్యక్రమంలో చంద్రబాబు చేసిన మోసాలను, జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రజలకు వివరించాలి.

– పీడిక రాజన్నదొర, ఏపీ డిప్యూటీ సీఎం

ఇదొక సువర్ణావకాశం



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు 45 రోజుల పాటు రూపొందించిన పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు ద్వారా ప్రజలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మమేకమయ్యేందుకు సువర్ణావకాశం. గత చంద్రబాబు పాలనలో జరిగిన మోసాలను, దోపిడీలను వివరించేందుకు ఇదొక చక్కటి వేదిక. 30 నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు, వచ్చే నెల 11 నుంచి జరిగే ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి..? కార్యక్రమాలను విజయవంతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన ఫలితాలు 2024 ఎన్నికల్లో పునరావృతం చేయాలి. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీచైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, విజయనగరం



వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

జగనన్న ఆరోగ్య సురక్షకు సర్వం సిద్ధం



గంట్యాడ మండలం పెదవేమలిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

- నేడు జిల్లాలో 28 వైద్యశిబిరాల నిర్వహణ
- వైద్య శిబిరాలను సందర్శించనున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా శనివారం 28 చోట్ల వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. ఇందులో 27 మెడికల్ క్యాంపులు గ్రామీణ ప్రాంతాల్లోను, ఒకటి పట్టణ ప్రాంతంలో నిర్వహిస్తారు. అవసరమైన మందులు, ఫోల్డర్స్, ఇతర సామగ్రిని అధికారులు ఇప్పటికే పంపిణీ చేశారు.

బీపీ, సుగర్ పరీక్షలు

జిల్లాలో 17 లక్షల మంది జనాభా ఉన్నారు. 6 లక్షలు ఇళ్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 3 లక్షల ఇళ్లను వైద్య సిబ్బంది సందర్శించారు. 3.50 లక్షల మందికి వైద్య పరీక్షలు పూర్తిచేశారు. 18 ఏళ్లు పైబడిన వారిందరికీ బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు చేస్తున్నారు. 10 ఏళ్లు పైబడిన వారికి హెచ్‌బీ పరీక్ష చేస్తున్నారు. డెంగీ, మలేరియా, రెండు వారాలకు మించి దగ్గు ఉంటే ప్రత్యేక వైద్యపరీక్షలు చేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపుల్లో వైద్య సేవలందించేందుకు 108 మంది స్పెషలిస్టు వైద్యులను అధికారులు మ్యాపింగ్ చేశారు. ప్రతి మెడికల్ క్యాంపులోను నలుగురు వైద్యులు పాల్గొంటారు. వీరిలో ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు ఉంటారు. శిబిరాల్లో ఓపీ చూడడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారు. శిబిరాలను ప్రజాప్రతినిధులు సందర్శించనున్నారు. గరివిడి మండలం కొండ శంబాంలో నిర్వహించే శిబిరాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, గుర్ల మండలం పాలవలసలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గాజులరేగలో జరిగే శిబిరాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సందర్శించనున్నారు.

వైద్యాన్ని చేరువచేద్దాం



మాట్లాడుతున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి



హాజరైన డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు

విజయనగరం అర్బన్: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో చేపట్టే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ దీనిని తమ కార్యక్రమంగా భావించి ప్రజలకు వైద్యాన్ని చేరువచేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఆన్‌లైన్‌లో లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమ నిర్వహణకు జిల్లాలో చేసిన ఏర్పాట్లను కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. వైద్యసేవలు పొందిన వారికి ప్రభుత్వ యంత్రాంగం అవసరమైన సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, జేసీ మయూర్ అశోక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కొత్త నియామకాలు

- ఉత్తర్వులు జారీచేసిన పార్టీ కేంద్ర కార్యాలయం

విజయనగరం: పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నూతన నియామకాలు చేపట్టారు. విజయనగరం జిల్లాలో పలు మండల, పట్టణాలకు నూతన అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్రకార్యాలయం శుక్రవారం నియామకాల జాబితాను విడుదల చేసింది.

- బొబ్బిలి నియోజకవర్గానికి సంబంధించి బొబ్బిలి పట్టణ అధ్యక్షుడిగా చోడిగంజి రమేష్ నాయుడు, మండల అధ్యక్షుడిగా ఉత్తరావల్లి అప్పలనాయుడు, బాడంగి మండలాధ్యక్షుడిగా బొమ్మినేని వెంకటనాయుడు, తెర్లాంకు తెంటు సత్యంనాయుడు, రామభద్రపురం మండలాధ్యక్షుడిగా అప్పికొండ లక్ష్మణనాయుడు నియామకమయ్యారు.
- విజయనగరం నియోజకవర్గంలో విజయనగరం మండలాధ్యక్షునిగా ఎస్.శ్రీనివాసరావు, కార్పొరేషన్‌లో క్లస్టర్-1 అధ్యక్షుడిగా ముద్దాడ మధు, క్లస్టర్-2కు సంగంరెడ్డి బంగారునాయుడు, క్లస్టర్-3కు కేవీఎస్.తమ్మన్నశెట్టి, క్లస్టర్-4 అధ్యక్షుడిగా ఆశపు వేణు నియామకమయ్యారు.
- చీపురుపల్లి మండలాధ్యక్షుడిగా ఇప్పిలి అనంతం, గరివిడికి కొనిసి కృష్ణంనాయుడు, గుర్లకు జమ్ము స్వామినాయుడు, మెరకముడిదాం మండలాధ్యక్షుడిగా కోట్ల వెంకటరావు నియామకమయ్యారు.
- గజపతినగరం నియోజకవర్గంలోని బొండపల్లి మండలాధ్యక్షుడిగా బి.చిన్నంనాయుడు, దత్తిరాజేరుకు రాపాక కృష్ణమూర్తి, గజపతినగరానికి బూడి వెంకటరావు, గంట్యాడకు ఆర్.రామినాయుడు, జామి మండలాధ్యక్షుడిగా గొర్లె రవికుమార్ నియామకమయ్యారు.
- నెల్లిమర్ల నియోజవర్గానికి సంబంధించి నెల్లిమర్ల పట్టణ అధ్యక్షుడిగా చిక్కాల సాంబశివరావు, మండలాధ్యక్షుడిగా చనుమల్ల వెంకటరమణ, భోగాపురానికి ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, డెంకాడకు బంటుపల్లి వాసుదేవరావు, పూసపాటిరేగ మండలాధ్యక్షుడిగా పతివాడ అప్పలనాయుడు నియామకమయ్యారు.
- రాజాం నియోజకవర్గానికి సంబంధించి రాజాం పట్టణ అధ్యక్షుడిగా పాలవలస శ్రీనివాస్, మండలాధ్యక్షుడిగా లావేటి రాజగోపాల్‌నాయుడు, రేగిడి ఆముదాలవలసకు వావిలపల్లి జగన్ మోహన్‌రావు, సంతకవిటికి గురుగుబిల్లి స్వామినాయుడు, వంగర మండలాధ్యక్షుడిగా కరణం సుదర్శన్ నియామకమయ్యారు.
- శృంగవరపుకోట నియోజకవర్గానికి సంబంధించి జామి మండలాధ్యక్షుడిగా గొర్లె రవికుమార్, కొత్తవలస మండలాధ్యక్షునిగా ఒబ్బిన నాయుడు, ఎస్.కోటకు మోపాడకుమార్, వేపాడ మండలాధ్యక్షుడిగా మమ్ములూరు జగన్నాథం నియామకమయ్యారు.

ఎన్‌ఎంఎంఎస్ విజేతల వివరాలు నమోదు

విజయనగరం అర్బన్: నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)-2023 పరీక్షలో ఎంపికైన విద్యార్థుల వివరాలను సంబంధిత మంత్రిత్వశాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. నవంబర్ 30వ తేదీలోగా విద్యార్థుల పేర్లు, బ్యాంకు ఖాతావివరాలు తప్పులులేకుండా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. డిసెంబర్ 30వ తేదీలోగా ఆ వివరాలను జిల్లా నోడల్ అధికారి (డీఎన్‌ఓ)తో ధ్రువీకరించుకోవాలన్నారు. నవంబర్ 2019, ఫిబ్రవరి 2021, మార్చి 2022 సంవత్సరంలో ఎంపికయిన విద్యార్థులు కూడా రెన్యువల్ చేసుకోవాలన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

విజయనగరం ఫోర్ట్: యూపీహెచ్‌సీ, ఎస్‌ఎన్‌సీయూలో ల్యాబ్ టెక్నీషియన్, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఎన్‌ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. వీటిపై అభ్యంతరాలుంటే అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సంబంధిత డాక్యుమెంట్స్‌పై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

14,568 మంది వాహనమిత్రలకు

రూ.14.56 కోట్ల లబ్ధి



వైఎస్సార్ వాహనమిత్ర నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: వైఎస్సార్ వాహనమిత్ర నిధులను విజయవాడ వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. లబ్ధిదారుల ఖాతాలకు ఐదో ఏడాది రూ.10 వేలు చొప్పున జమచేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ మయూర్ అశోక్, రవాణాశాఖ ఉప కమిషనర్ జి.ఆర్.రవీంద్రనాథ్, జిల్లా రవాణా అధికారి ఎస్.రమేష్, ఎంవీఐలు వీక్షించారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ అశోక్ మాట్లాడుతూ వైఎస్సార్ వాహనమిత్ర పథకం 5వ ఏడాది జిల్లాలో 14,568 మంది లబ్ధిదారులకు రూ.14,56,80,000 ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు.

గత నాలుగు విడతల్లో కలుపుకొని మొత్తం 71,410 మందికి రూ.71,41,00,000 అందించినట్టు వెల్లడించారు. ఆటో, టాక్సీ, క్యాబ్, మ్యాక్సీ క్యాబ్, మొబైల్ పంపిణీ యూనిట్ల యజమానులు, డ్రైవర్లు ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున నేరుగా వారి ఖాతాలకు జమచేసినట్టు తెలిపారు. వాహనాల నిర్వహణ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ చార్జీలకు ఈ మొత్తాన్ని వినియోగించుకోవాలని వాహనదారులకు సూచించారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలో శనివారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కార్యాలయం వర్గాలు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపాయి. విద్యాశాఖామంత్రి బొత్ససత్యనారాయణతో పాటు ఉపముఖ్యమంత్రి రాజన్నదొర పాల్గొనే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. శనివారం ఉదయం పాచిపెంట మండలంలోని విశ్వనాథపురం, సాలూరు మండలంలోని అన్నంరాజువలస, మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామాల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా ఉపముఖ్యమంత్రి పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పెదవేమలి విద్యార్థులు


లక్ష్మీదేవి


భారతి

గంట్యాడ: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు గంట్యాడ మండలంలోని పెదవేమలి విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పొటుపురెడ్డి భారతి ఖేలో ఇండియా నేషనల్ జూనియర్స్ కేటగిరిలో, సబ్ జూనియర్స్ కేటగిరిలో సిరపురపు లక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలోని జేఎన్‌టీయూలో జరిగిన సెలక్షన్స్‌లో ఎంపికైన వారు ప్రస్తుతం అక్కడ శిక్షణ పొందుతున్నారు. అక్టోబర్ 6,7,8 తేదీల్లో తమిళనాడులో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో భారతి, లక్ష్మీదేవిలకు పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి, జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అభినందనలు తెలియజేశారు.

అక్రమంగా మందులు విక్రయించిన ముద్దాయికి జైలు

- రూ.లక్ష జరిమానా విధింపు

విజయనగరం ఫోర్ట్: అక్రమంగా మందులు నిల్వ ఉంచి విక్రయించిన నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానాను జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి రజని విధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2015వ సంవత్సరంలో లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నారన్న సమాచారంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు యుగంధర్ రావు, కల్యాణి ఆకస్మిక తనిఖీ చేయగా గజపతినగరంలోని బీవీ.నారాయణ రాజేశ్వరరావు నిల్వ ఉంచిన మందులు బయటపడడంతో స్వాధీనం చేసుకుని విజయనగరం అడిషనల్ డిస్ట్రిక్ కోర్టులో కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు విన్న తరువాత నేరం నిరూపణ కావడంతో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జి.రజని పైవిధంగా తీర్పు వెలువరించారు. ఈకేసులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతపల్లి అప్పారావు వాదించారు.

దొంగలా మారిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి

రాజాం సిటీ: ఇంజినీరింగ్ చదువుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడిన శ్రీకాకుళం మండలం కరజాడ గ్రామానికి చెందిన బలగ హరిబాబు దొంగలా మారాడు. జల్సాలతో పాటు బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులు పడ్డాడు. ఈ క్రమంలో దొంగతనాలవైపు తన దృష్టి మళ్లించాడు. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం వెల్లడించారు. ఓ కేసులో వరంగల్ పోలీసులు అరెస్టు చేసి విడుదల చేసిన అనంతరం హరిబాబు శ్రీకాకుళం వచ్చాడు. అక్కడ తెలిసిన వారి వద్ద రూ.6 లక్షల వరకు అప్పులు చేసి వాటిని తీర్చేందుకు దొంగతనాన్ని ఎంచుకుని తన మేనత్త ఇంట్లోనే చోరీకి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా మరికొన్ని నేరాలకు పాల్పడి శ్రీకాకుళంలో పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. శిక్ష అనుభవించి ఆగస్టు 23న విడుదలై వచ్చాడు. ఈ నెల 18న రాజాంలోని వాసవినగర్‌లో నివాసం ఉంటున్న జి.సిగడాం మండలం ఎందువ గ్రామానికి చెందిన గొద్దు వెంకటరమణ ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు నెక్లెస్‌లు, చెవి దిద్దులు, గాజులు, హారాలతోపాటు నగదు పట్టుకుపోయాడు. అక్కడినుంచి విశాఖపట్నం వెళ్లి ఐఐఎఫ్ఎల్ బ్యాంకులో నాలుగు గాజులు, ఒక హారం తాకట్టుపెట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు చేపట్టిన దర్యాప్తులో భాగంగా నిందితుడిని రణస్థలం సమీపంలో పట్టుకుని 241 గ్రాముల బంగారం, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ కె.రవికుమార్, ఎస్సై రవికిరణ్‌లను ఆయన అభినందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

దబ్బ కొట్టిన ధర


కొనుగోలు చేసిన పుట్ట దబ్బకాయలను వ్యాన్‌లో తరలించడానికి సిద్ధం చేసిన వ్యాపారులు

- కావిడ కాయలు రూ.200, 300కు విక్రయం
- కొండపోడు వ్యవసాయంలో సాగు
- సీతంపేట ఏజెన్సీలోనే అధిక దిగుబడి
- 500 ఎకరాల్లో పంట
- మైదాన ప్రాంతాల్లో డిమాండ్

సీతంపేట: స్థానిక మార్కెట్‌లోకి పుట్టదబ్బ వచ్చేసింది. ఏటా ఈ సీజన్‌లో లభించే ఈ పంటకు మన్యంలో మంచి డిమాండ్ ఉంది. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు. అంతగా పెట్టుబడులు అక్కర్లేని ఈ పంటను పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా సీతంపేట ఏజెన్సీలో సుమారు 5 వందల ఎకరాల్లో కొండపోడు వ్యవసాయంలో భాగంగా పండిస్తారు. అయితే ఆరుగాలం శ్రమించి పండించిన పంట తక్కువ ధరకు ఈ సంవత్సరం విక్రయించాల్సి వస్తోందని గిరిజనరైతులు వాపోతున్నారు. కావిడ దబ్బ రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నామని చెబుతున్నారు. ఒక కావిడలో సరాసరి 40 వరకు దబ్బకాయలు ఉంటాయి. ఒక్కొక్కటి రూ.5 ధర పడుతుంది. వ్యాపారులు ఒడిశాతో పాటు ఇతర పట్టణాల్లో రూ.10 వరకు కాయను విక్రయిస్తారు. గతేడాది ఇదేసీజన్‌లో ఒక్కో కావిడ రూ.500 వరకు పలికిందని గిరిజనులు చెబుతున్నారు. ఈ సంవత్సరం ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వాపోతున్నారు. హడ్డుబంగి, సోమగండి, గొయిది, శంభాం, కుశిమి, పెదరామ తదితర పంచాయతీల పరిధిలో దబ్బ ఎక్కువగా పండుతుంది.

సిండికేట్ అవుతున్న వ్యాపారులు

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలుకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి ఆబ్బ కొనుగోలు చేస్తారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. ఎక్కువగా ఇవి పచ్చళ్ల తయారు చేసే చిన్నతరహా కంపెనీలకు విక్రయిస్తామని వ్యాపారులు చెబుతున్నారు.


పుట్ట దబ్బకాయలు

గిరిజన రైతులు చెప్పిన ధరకు కాకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరకే ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాల్లో గిరిజనులు ముందుగా దళారీ వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటారు. పంట పక్వానికి వచ్చే సమయంలో వ్యాపారులకు ఇస్తారు. ఇలా కూడా గిరిజనులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది.

సేకరణ కష్టమే



పైనాపిల్, సీతాఫలం తర్వాత ఆదాయాన్ని ఇచ్చేది పుట్టదబ్బ పంట. శ్రమకు తగ్గ ఫలితం లేదు. వీటిని సేకరించడం కష్టమైన పని. కావిడలో మోసుకుని తీసుకువస్తాం. ఎక్కువగా వారపు సంతల్లో అమ్మకాలు చేపడతాం. ముఖ్యంగా సీతంపేట పెద్ద వారపు సంత కాబట్టి ఇక్కడికే ఆది, సోమవారాలు తీసుకువస్తాం.

సవర రాజ్‌కుమార్, గొయ్యిగూడ

మద్దతు ధర కల్పించాలి



పుట్టదబ్బకు మద్దతు ధర కల్పిస్తే బాగుంటుంది. మద్దతు ధర లేకపోవడంతో అనేక నష్టాలు చవిచూస్తున్నాం. దీంతో వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్మకాలు చేస్తున్నాం.

ఎస్.బంగారయ్య, పెద్దగూడ

రాష్ట్రస్థాయి పోటీలకు బొద్దాం విద్యార్థులు


రాజాం: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

రాజాం: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు రాజాం మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన దాసరి భాస్కరరావు, జినగం జశ్వంత్‌లు జూనియర్ విభాగంలో, భైరి పురుషోత్తం, ఎస్ఎస్ఎస్ఎస్‌వీ ప్రసాద్, మానెం షర్మిల సీనియర్ విభాగంలో టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. వారిని త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికచేసిందని పాఠశాల హెచ్‌ఎం చీపేన గురుమూర్తి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ త్రినాథరావు, పాఠశాల కార్యదర్శి వై.భాస్కరరావు, ఉపాధ్యాయ సిబ్బంది శుక్రవారం పాఠశాల ఆవరణలో అభినందించారు.

కరాటే పోటీలకు వీరభద్రపురం విద్యార్థులు


కొత్తవలస: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్ రాజాబాబు

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామానికి చెందిన గనివాడ సాయిచైతన్య, కర్రి నవీన్‌లు స్కూల్‌గేమ్స్‌లో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు అండర్-17 విభాగంలో ఎంపికైనట్లు ప్రధాన కోచ్ కె.రాజుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీన విజయగనరంలో జరిగిన పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సాయిచైతన్య ఏపీ మోడల్ స్కూల్‌లో, నవీన్ స్థానిక సూర్యోదయ మోడల్ స్కూల్‌లో చదువుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు వీరఘట్టం విద్యార్థులు


పవన్‌తేజ


సంజన

వీరఘట్టం: శ్రీకాకుళంలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీల్లో వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు సత్తాచాటారు. శుక్రవారం జరిగిన పోటీల్లో 3 కి.మీల పరుగు పందెంలో ఎం.పవన్‌తేజ ద్వితీయస్థానంలో నిలిచాడు, అలాగే 1500 మీటర్ల పరుగు పందెంలో పి.సంజన ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శిర్లాపు ఉమామహేశ్వరరావు తెలిపారు. నవంబర్ నెలలో పల్నాడు జిల్లాలో జరగనున్న అండర్-17 అథ్లెటిక్ మీట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బి.సాంబర, ఉపాధ్యాయులు కల్లూరి శివకుమార్, సుధీర్, గర్భాన శ్రీనివాసరావు తదితరులు పవన్‌తేజ, సంజనలను అభినందించారు.

అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీలకు మౌనిక

- అక్టోబర్ 1 నుంచి సౌత్ ఆఫ్రికాలో జరగనున్న పోటీలు


అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన మౌనిక

విజయనగరం: క్రీడల ఖిల్లాగా పేరుగాంచిన విజయనగరం జిల్లాలో మరో క్రీడా ఆణిముత్యం వెలుగులోకి వచ్చింది. టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన నగరంలోని కేఎల్‌పురం ప్రాంతానికి చెందిన రెడ్డి మౌనిక అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించింది. అక్టోబర్ 1 నుంచి సౌత్ ఆఫ్రికా వేదికగా జరిగే అంతర్జాతీయ పోటీలకు రాష్ట్రం తరపున పాల్గొనే అవకాశం దక్కించుకుంది. క్రీడాకారిణి ప్రయాణఖర్చుల కోసం విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందజేశారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన మౌనికను జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావులు అభినందించారు.

అండర్-19 జిల్లా ఫుట్‌బాల్ జట్లు సిద్ధం


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా బాలుర జట్టు

- వచ్చే నెల 7 నుంచి చిత్తూరు జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు


బాలికల జట్టు

విజయనగరం: అంతర్ జిల్లాల అండర్-19 బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు శుక్రవారం విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించగా..జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారులను వివిధ అంశాల్లో పరీక్షించిన అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిని 18 మంది బాలురను, 18 మంది బాలికలను ఎంపిక చేశారు. ఎంపికైన ఇరు జట్ల క్రీడాకారులు వచ్చే నెల 7 నుంచి చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరగనున్న అండర్-19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలను పలువురు పీడీలు, ఫుట్‌బాల్ కోచ్‌లు పర్యవేక్షించారు.

గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభ వెలికితీయాలి

- డీఈఓ ప్రేమ్‌కుమార్


క్రీడాకారులను అభిందిస్తున్న డీఈఓ, వ్యాయామ ఉపాధ్యాయులు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ ప్రేమ్ కుమార్ సూచించారు. ఈ మేరకు మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బాల, బాలికలకు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యను ప్రోత్సహిస్తున్నంతగా వ్యాయామ విద్యను వ్యాయామ ఉపాధ్యాయులు పోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సీతానగరం ఉన్నత పాఠశాలకేంద్రంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఉన్నత పాఠశాలలకు చెందిన 210 మంది క్రీడాకారులు అండర్ 17 స్థాయిలో పోటీల్లో పాల్గొన్నారని తెలియజేశారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. ఎంఈఓ జి.సూరిదేముడు మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించడానికి, శరీర ఆరోగ్యపరిరక్షణకు క్రీడలు దోహద పడతాయన్నారు. విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి చూపడం మంచిపరిణామమని అభినందించారు. కార్యక్రమం లో ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5వ తేదీన క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

- డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు


డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో గల రాష్ట్ర క్రీడా అకాడమీలో ప్రవేశాలకు వచ్చేనెల 5వ తేదీన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, టెన్నిస్, వాలీబాల్ క్రీడలకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో 12 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. 5వ తేదీ ఉదయం 9గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9052248464 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి


డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ స్కాలర్‌షిప్ ఎన్ఎంఎంఎస్ 2023 సంవత్సరానికి ఎంపికైన విద్యార్థుల వివరాలు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను తప్పులు లేకుండా మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగా ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్స్‌లో ఉండేవిధంగా పోర్టల్‌లో నవంబర్ 30లోగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలల మోడల్ అధికారి డిసెంబర్ 15వ తేదీలోగా క్షుణ్ణంగా పరిశీలించి వివరాల నమోదు తీరును చూడాలని సూచించారు. నమోదు చేసిన అప్లికేషన్ ప్రింట్ తీసి దాంతోపాటు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు, అకౌంట్ పాస్‌బుక్ మొదటి పేజీని జతపరచి డీఈఓ కార్యాలయానికి సమర్పించాలని చెప్పారు. జిల్లా మోడల్ అధికారి లాగిన్ ద్వారా వెరిఫై చేయించుకున్న అప్లికేషన్లకు మాత్రమే స్కాలర్‌షిప్ మంజూరవుతుందన్నారు. గత సంవత్సరాలలో ఈ పరీక్షకు ఎంపికై ప్రస్తుతం 10,11,12 తరగతులు చదువుతూ అర్హత కలిగిన ప్రతి విద్యార్థి ఈ ఏడాది రెన్యువల్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.

గుండెను పరిరక్షించుకోవాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

- ఎస్పీ దీపికా పాటిల్

విజయనగరం ఫోర్ట్: గుండెను పరిరక్షించుకోవడం ద్వారా ఎక్కువ కాలం జీవించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ దీపికా పాటిల్ కోరారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుమల మెడికవర్ ఆస్పత్రి, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా స్థానిక కోట జంక్షన్ వద్ద నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. గుండె సమస్యల పట్ల అలసత్వం వహించరాదన్నారు. 45 ఏళ్ల దాటిన వారు నిరంతరం వ్యాయమం చేయడంతో పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించవచ్చన్నారు. అనంతరం తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించిన సదస్సులో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ కృష్ణశాంతి, పద్మకుమార్ తదితరులు పాల్గొన్నారు.

3న స్పాట్ అడ్మిషన్లు

చీపురుపల్లి: పట్టణంలోని జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీ కోసం అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎల్.విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పాలిసెట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ కాని మిగులు సీట్లకు మాత్రమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఈఈఈ), మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులు అక్టోబర్ 3లోగా తమ సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో స్పాట్ అడ్మిషన్‌కు హాజరవ్వాలని పేర్కొన్నారు. పదో తరగతి మార్క్స్ మెమో, కుల ధ్రువీకరణ, పదో తరగతి టీసీ, తండ్రి/తల్లితో బాటు విద్యార్థి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 8919620773, 9074378305 నంబర్లలో కళాశాల సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు శుక్రవారం తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి సీహెచ్.సురేష్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కనుగొన్నామని చెప్పారు. మృతుడు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని, లేత గులాబీ రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, పూలతో లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. సంబంధీకులు ఎవరైనా తమను సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- జేసీ ఆర్.గోవిందరావు
- జగనన్నకు చెబుదాంలో 55 వినతులు


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ గోవిందరావు

పాలకొండ: ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి 55 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రానికి అర్జీదారులు తిరగకుండా తమ ప్రాంతంలోనే వినతులు స్వీకరించి వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ప్రభుత్వం రూపొందించిదని తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఎస్ఈ ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.డి నాయక్, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరి, నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సువర్ణముఖిలో వృద్ధుడి గల్లంతు


గల్లంతైన సూర్యనారాయణ (ఫైల్)

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామసమీపంలో ఉన్న సువర్ణముఖి నదిలో వృద్ధుడు సూరిమల్లి సూర్యనారాయణ (75) శుక్రవారం గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు వెల్లడించిన వివరాలు ప్రకారం ఎప్పటిలాగే సూర్యనారాయణ నదిలో చేపలవేటకోసం వెళ్లి కాలుజారి కొట్టుకుపోయాడు. సూరిమల్లి సింహాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.జనార్దనరావు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■ Near Bhogapuram 400 Sq.Yards East Facing, VUDA Approved Plots For Sale. Ph : 90101 97197 [V- 2146]

■ బైక్ ఫ్రీ: VZM - రాయపూర్ రోడ్, 5గో బెటాలియన్ ఎదురుగా, హైవేకి 2 మినిట్స్. రేడీ టు కన్‌స్ట్రక్షన్ VMRDA ప్లాటు కొనుగోలుపై రూ॥ 80,000/- విలువైన E- బైక్ ఫ్రీ. భోగాపురం, ఆనందపురంలలో ప్లాట్లు కలవు. ఫోన్ : 73308 11149 [V-2850]

SITE FOR SALE

■ విజయనగరం, భోగాపురం, కందివలస జంక్షన్ హైవే దగ్గరలో VMRDA ప్లాట్లు కలవు. అతి తక్కువ ధరలలో లభించును. ఫోన్ : 98857 88083 [V-2137]

COMMERCIAL SALE

■ Commercial Property for Sale Land Building 1428 Sq.yds 24500 Builtup Area at Saidabad,Hyd. Rent getting 5 Lakhs. Ph: 9849090098 [HA-346]

BUSINESS OFFER

■ Gamgana Flutures కంపెనీలో కేవలం అతితక్కువ పెట్టుబడితో ఆర్థిక ఆదాయం పొందే గొప్ప అవకాశం, డైలీ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్, Dont Miss సంప్ర॥ 7396065388 [G-801151]

■ RK Golod 100% Genunine అయితే 0% కమీషన్‌తో మీ బ్యాంక్‌లో తాకట్టు బంగారం విడిపించి ఆరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ఫోన్: 96037 57534 [V-5933]

WANTED

■ అర్జెంట్‌గా కావలెను. VZM రింగ్ రోడ్డు బ్రాంచ్ సాయి గోల్డెన్ వెంచర్స్‌లో పనిచేయుటకు టెలికాలర్స్ F(5), ఆఫీస్ స్టాఫ్ & అకౌంటెంట్స్ (2) AGM, DGM, GM, న్యూ & సీనియర్ మార్కెటింగ్ మిత్రులకు ఇదే మా ఆహ్వానం, మంచి జీతం, అలవెన్స్, భోజనం, కమిషన్ కలదు. Cell: 9391873337 [S-1191147]

■ రావులపాలెం Food Industries నందు పనిచేయుటకు 2 సం॥ అనుభవం కలిగిన Accountant with Tally తో కావలెను. Cell: 9494895111, 9849968111 [S-1184618]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221646]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9160900024 [HA-657]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.